క్లుప్తంగా

చెట్ల కొమ్మలు వెంటనే తొలగించాలి



పటమట(విజయవాడతూర్పు): నగరంలో ఆదివారం కురిసిన అకాల వర్షం, గాలి దుమారానికి నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్ల వెంబడి చెట్లు పడిపోయాయి. వీఎంసీ ఉద్యానవన విభాగం, ప్రజారోగ్య విభాగం అధికారులు పడిపోయిన చెట్ల కొమ్మలను తొలగించే క్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆయా ప్రాంతాల్లో పర్యటించి అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. సర్కిల్–2 పరిధిలోని పాత ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డులో పడిపోయిన చెట్లకొమ్మలను వెంటనే తొలగించాలని, రోడ్లపై రాకపోకలు సజావుగా సాగేలా తొలగించిన కొమ్మలను కూడా అక్కడి నుంచి తరలించాలని వీఎంసీ ఉద్యానవన విభాగం, ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు.

20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగిస్తూ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు పిలుపునిచ్చారు. గవర్నర్‌పేటలోని ఎం.బీ.విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఏపీ సెక్యూరిటీ గార్డ్స్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సాయిబాబు మాట్లాడుతూ.. సెక్యూరిటీ గార్డ్స్‌కు కనీస వేతనం అమలు చేయాలని, పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సెక్యూరిటీ గార్డ్స్‌తో సహా 50 లక్షల మంది కార్మికులు పనిచేసే షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్‌లో రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలు సవరించలేదన్నారు. వేతనాల కోడ్ పేరిట జాతీయ కనీస వేతనం పేరుతో కార్మికుల వేతనాలపై దాడి జరుగుతోందని చెప్పారు. ఈ నెల 10లోగా సదస్సులు, 17, 18 తేదీల్లో మోటార్ సైకిల్ జాతాలు నిర్వహించాలని, 20న సమ్మె సందర్భంగా నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రేడింగ్ గేట్లపై నిర్లక్ష్యం



పాయకాపురం(విజయవాడరూరల్): అవుట్‌ఫాల్ డ్రైనేజీలో వ్యర్థాలను అదుపు చేసేందుకు వీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాటు చేసిన గ్రేడింగ్ ఐరన్ గేట్లపై నిర్లక్ష్యపు నీడ పడుతోంది. పాయకాపురం చేపల మార్కెట్ వద్ద అవుట్‌పాల్ డ్రైనేజీలో ఏర్పాటు చేసిన ఐరన్ గ్రేడింగ్ గేట్‌ను అధికారులు పట్టించుకోపోవడంతో వ్యర్థాలు కిందకు వస్తున్నాయి. రైతుబజారు వద్ద అవుట్‌ఫాల్ డ్రైన్ వద్ద కూడా ఇదే పరిస్థితి. ఇక్కడ మరో గ్రేడింగ్ గేట్ ఉండటంతో ఇంజినీరింగ్ సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు గ్రేడింగ్ గేట్ నిర్వహణపై అలసత్వం చూపకుండా చర్యలు తీసుకోవాల్సింది.

దుర్గమ్మకు నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం బెంగళూరుకు చెందిన నృత్య విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. బెంగళూరుకు చెందిన మునిపల్లి మహతి పర్యవేక్షణలో సుమారు 19 మంది విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో విద్యార్థులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇవ్వగా భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆదివారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై నృత్య ప్రదర్శన ఇచ్చారు. నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులను పలువురు భక్తులు అభినందించారు. అనంతరం ఆలయ అధికారులు వారికి అమ్మవారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): అకాల వర్షంతో అపరిశుభ్రంగా మారిన కొండపల్లి మున్సిపాల్టీ వీధుల్లో పారిశుద్ధ్య పనులను కార్మికులు ఆదివారం చేశారు. వర్షం నీటితో ఇబ్రహీంపట్నం, కొండపల్లిలో పలు వార్డుల్లో డ్రెయినేజీలు పొంగి పొర్లాయి. డ్రెయినేజీల్లోని వ్యర్థాలతో రోడ్లు అపరిశుభ్రంగా మారాయి. వ్యర్థాలతో పాటు రోడ్ల గడ్డి మొక్కలను తొలగించారు.



భారీ వర్షం

ఉక్కబోతతో ప్రజలు అల్లాడుతున్న వేళ ఆదివారం ఉదయం నగరంలో భారీ వర్షం కురిసింది. రోడ్లపై చెట్లు, హోర్డింగ్‌లు పడిపోయాయి. పశ్చిమ, తూర్పు, సెంట్రల్ నియోజకవర్గాల్లో వీధులు నీట మునిగాయి. వర్షం కారణంగా పలుచోట్ల వాహనాలు మొరాయించాయి. నగరంలో రోడ్లపై వాహనాలు బారులు తీరి కనిపించాయి. భానుడి ప్రతాపానికి ఆపసోపాలు పడుతున్న ప్రజలకు వర్షం కాస్త ఉపశమనమిచ్చింది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ











గాయత్రీ సొసైటీ సేవలు అభినందనీయం

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): పేద బ్రాహ్మణులకు చేయూతనందించడంలో గాయత్రీ సొసైటీ, బ్రాహ్మణ సేవా సంఘం పాత్ర అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఆదివారం గాయత్రీ కళ్యాణ మండపంలో జరిగిన బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రాహ్మణ సామాజిక వర్గ అభ్యున్నతికి దశాబ్దకాలంగా గాయత్రీ సొసైటీ చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ముఖ్యంగా కరోనా కష్టకాలంలో పేద బ్రాహ్మణులకు మెడికల్ క్యాంపులు నిర్వహించడంలో సొసైటీ పాత్ర మరువలేనిదన్నారు. సంప్రదాయాలు, సనాతన ధర్మాన్ని కాపాడుకునే విధంగా ఏటా సామూహిక ఉపనయన మహోత్సవాలు నిర్వహించడం, బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికలతో ఎన్నో సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలతో నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శర్వాణీమూర్తి, బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు కొప్పరపు బలరాం, శ్రీరామచంద్రమూర్తి, తణుకు రామకృష్ణ, కొప్పరపు మారుతీ, జె.కె.సుబ్బారావు, చల్లా సుధాకర్ పాల్గొన్నారు.



బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

సైడ్ డ్రెయిన్లలో విద్యుత్ స్తంభాలు



ఇందిరానాయక్‌నగర్ పోస్ట్‌మ్యాన్ రామచంద్రరావు వీధిలోని సైడ్ డ్రెయిన్‌లో విద్యుత్ స్తంభం



సింగ్‌నగర్ కృష్ణాహోటల్ సెంటర్ వెనుక భాగంలో కాల్వ మధ్యలో..



సింగ్‌నగర్ వాటర్ ట్యాంక్ ఎదుట డ్రెయిన్‌లో..

రోడ్ల వెంట ఉండాల్సిన విద్యుత్ స్తంభాలు సైడ్ డ్రెయిన్లలో ఉండటంతో ప్రజలు నిత్యం అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. 58, 59 డివిజన్లలో సింగ్‌నగర్, ఇందిరానాయక్‌నగర్ పరిసర ప్రాంతాల్లో పలుచోట్ల డ్రెయిన్లలో వీధిలైట్ల కోసం వేసిన స్తంభాలు ఉండటంతో కాలువల్లో మురుగు పారేందుకు అవి ఆటంకంగా మారుతున్నాయి. వాటి వద్ద చెత్త ఆగిపోయినా.. ఏదైనా కొద్దిపాటి వర్షం కురిసినా ఇక అంతే సంగతులు. ఆ కాల్వల్లోని నీరంతా రోడ్లపైకి, ఇంటి వాకిట్లలోకి చేరిపోయి కనీసం నడవడానికి కూడా వీల్లేకుండా చేస్తున్నాయి. సమస్యను సంబంధిత సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా ఒక్కరు కూడా పట్టించుకోవడం లేదని, ట్రాన్స్‌కో ఉన్నతాధికారులైనా మా సమస్యలను గుర్తించి వీటి నుంచి పడుతున్న ఇబ్బందుల నుంచి విముక్తి కలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

–అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్)

7 నుంచి ధ్వజ స్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆంజనేయ వాగు సెంటర్‌లో వేం చేసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి వారి ఆలయంలో నూతన ధ్వజ స్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో వై.సీ తారామయ్య పేర్కొన్నారు. ఆదివారం ఉదయం ఆలయ ప్రాంగణంలో నూతన ధ్వజస్తంభానికి దాత పోతిన వెంకట మహేష్ దంపతులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. చిట్టినగర్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థాన ప్రధాన అర్చకులు వినుకొండ రామరత్నమాచార్యులు పూజా కార్యక్రమాలను జరిపించారు. ఈ సందర్భంగా ఈవో సీతారామయ్య మాట్లాడుతూ.. ఆలయంలో నూతన ధ్వజ స్తంభం ప్రతిష్ఠించడానికి వీరాంజనేయ స్వామి వారి అనుజ్ఞ అయిందన్నారు. ఆలయ అర్చకులు పరాశరం పవన్‌కుమార్‌చార్యులు, విన్నకోట శ్రీనివాసరావు శర్మ పర్యవేక్షణలో మురికిపూడి మణిదీప్ శిష్యబృందంచే ప్రతిష్ఠా కార్యక్రమాలను నిర్వహించనున్నామన్నారు. 7వ తేదీ సాయంత్రం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, వాస్తుపూజ జరుగుతాయన్నారు. 8వ తేదీ ఉదయం నవగ్రహ పూజ, అష్టకలశ స్నపన, పంచగవ్యాది వాసం, జలాధివాసం నిర్వహిస్తామని చెప్పారు. 9వ తేదీ ఉదయం 6.51 గంటలకు యంత్రస్థాపన, ధ్వజ స్థంభ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, అన్న ప్రసాద వితరణ జరుగుతాయని, భక్తులందరూ కార్యక్రమానికి విచ్చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాల కరపత్రాలను ఈవో, దాతలతో పాటు అర్చకులు, ఆలయ అధికారులు ఆవిష్కరించారు.

నేడు వీఎంసీ కార్యాలయాల్లో పీజీఆర్ఎస్

పటమట(విజయవాడతూర్పు): నగర ప్రజల ప్రతి సమస్యను పరిష్కరించడానికి వీఎంసీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం (పీజీఆర్ఎస్) నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు చిట్టినగర్‌లో ఉన్న సర్కిల్–1 కార్యాలయం, సత్యనారాయణపురంలో ఉన్న సర్కిల్–2 కార్యలయం, పటమటలోని సర్కిల్–3 కార్యాలయంలో కూడా జరుగుతుందని పేర్కొన్నారు. సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు నగరవాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తారని వివరించారు.

కరాటే విద్యార్థులకు అభినందన



కరాటే విద్యార్థులతో నార్త్ ఏసీపీ డాక్టర్ స్రవంతిరాయ్

పాయకాపురం(విజయవాడరూరల్): హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం పొందిన క్యోఇకు కరాటే అకాడమి విద్యార్థులను నార్త్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ స్రవంతి రాయ్ అభినందించారు. ఆదివారం పాయకాపురంలోని కరాటే అకాడమీలో హైదరాబాద్ సరూర్ నగర్ స్టేడియం లో గత నెల 27వ తేదీన హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు పోటీల్లో రికార్డు సాధించిన కరాటే విద్యార్థుల అభినందన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో చీఫ్ ముత్యాల కరుణాకర్, క్యోఇకు కరాటే అకాడమీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కుమార్తె అదృశ్యం

పాయకాపురం(విజయవాడరూరల్): కుమార్తె కనిపించడం లేదని వచ్చిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఓ మహిళ కుటుంబం వన్‌టౌన్ మల్లికార్జునపేట లో నివసిస్తోంది.

ఆమెకు ముగ్గురు ఆడపిల్లలు. మూడో కుమార్తెతో మంటాడకు చెందిన పోట్రు సాయికి ఆరేళ్ల క్రితం వివాహమైంది. వారికి కుమారుడు. భార్యభర్తల మధ్య గొడవ కారణంగా ఆ మహిళ పుట్టింటి వద్ద ఉంటోంది. వారం క్రితం అత్తగారి ఊరు మంటాడ వెళ్లింది. ఈ నెల 1వ తేదీన ఆమె నున్న గ్రామంలో ఉంటున్న తన అక్క సత్తెమ్మ ఇంటికి వచ్చి కొడుకును వదిలి వెళ్లిపోయారు. దీనిపై ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.







ప్రశాంతంగా..

వైద్య విద్యలో ప్రవేశాల కోసం ఆదివారం నగరంలో నిర్వహించిన 'నీట్' ప్రశాంతంగా జరిగింది. అభ్యర్థులను హాల్ టికెట్‌తో పాటు ఇతర గుర్తింపు కార్డులు ఉంటేనే లోపలకు అనుమతించారు. వారిని ప్రవేశద్వారాల వద్ద తనిఖీ చేసి లోపలకు పంపారు. విద్యార్థులు తల్లిదండ్రులతో పరీక్ష కేంద్రాల వద్ద సందడి నెలకొంది. పరీక్ష అయ్యే వరకు వారు కేంద్రాల గేట్ల వద్దే వేచి ఉన్నారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







దీక్షకు, సహనానికి ప్రతిరూపం భగీరథుడు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): దీక్ష, సహనానికి ప్రతిరూపం భగీరథుడు అని వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. లోక కల్యాణం కోసం కఠోర తపస్సు చేసి పవిత్ర గంగను దివి నుంచి భువికి తీసుకువచ్చిన మహర్షి అని కొనియాడారు. ముత్యాలంపాడులో ఆదివారం జరిగిన భగీరథ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆయన ముందుగా స్థానిక పెద్దలతో కలిసి భగీరథ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం భగీరథుడి జీవిత చరిత్రను స్మరించుకున్నారు. భగీరథుడు ఒక్క సగర ప్రజలకే కాదు.. యావత్ హైందవ ప్రజానీకానికి ఆరాధ్యుడు, పూజ్యనీయుడని మల్లాది విష్ణు పేర్కొన్నారు. మంచినీటి కొరతతో ఇబ్బంది పడుతున్న ప్రాణికోటి కష్టాలు తీర్చిన మహర్షి.. భగీరథుడని వ్యాఖ్యానించారు. ఆ మహనీయుని స్ఫూర్తితో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా ఇంటింటికీ తాగు నీరు ఇవ్వడానికి చర్యలు చేపట్టిందని గుర్తు చేశారు. నేతలు తాడిశెట్టి నాగేశ్వరరావు, బుజ్జి, శ్రీనివాసరావు, రామకష్ణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



భగీరథ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న విష్ణు, నాయకులు

వైభవంగా పాండురంగడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని కొత్త గుళ్ల ప్రాంగణంలో కొలువై ఉన్న పాండురంగడి సన్నిధిలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలోని శ్రీ రుక్మాబాయి సమేత పాండురంగస్వామి వారి ఆలయంలో త్రయోదశి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. ఉదయం ఆలయంలోని రుక్మాబాయి సమేత పాండురంగడికి ప్రత్యేక తిరుమంజన అభిషేకాన్ని నిర్వహించారు. అందులో భాగంగా పంచామృతాలు, పలు ఫల, విశేష జలాలతో అభిషేకాలను చేపట్టారు. అనంతరం స్వామి వారిని పెండ్లికుమారునిగా, అమ్మవారిని పెళ్లికుమార్తెగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం హంసవాహనంపై స్వామి వారికి వాహనసేవను జరిపారు. అనంతరం ఎదుర్కోలోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శేషవాహనంపై స్వామి వారిని అధిష్టింపజేశారు.



నటరాజుకు నాట్య వినోదం

విజయవాడకల్చరల్: నాట్యాచార్యుడు డాక్టర్ చింతారవి బాలకృష్ణ నృత్యశిక్షణలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించే కూచిపూడి నృత్య రంగ ప్రవేశం ఆదివారం ప్రారంభమైంది. తొలి రోజు కార్యక్రమంలో వల్లభజోస్యుల శ్రీదత్త ప్రదర్శించిన అంశాలు నేత్ర పర్వంగా సాగాయి. నర్తనగణపతి, చిందబరీశ్వర స్తవం, పదము, నగుమోము, థిల్లానా అంశాలను ప్రదర్శించారు. నృత్య సంప్రదాయాన్ని పాటించి లైవ్ కార్యక్రమంగా సాగిన కార్యక్రమంలో నట్టువాంగం డాక్టర్ చింతారవి బాలకృష్ణ, గాత్రం సీహెచ్ శ్రీనివాస్, మృదంగం పసుమర్తి హరినాథ్, వయోలిన్ పాలపర్తి ఆంజనేయులు, వేణువుతో కుమార్ బాబు సహకరించారు. కార్యక్రమంలో వల్లభజోస్యుల పవన్, శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

నాట్యాచార్యులకు గురు సత్కారం

శ్రీదత్త అరంగేట్రం సందర్భంగా సంగీత విద్వాంసుడు కుమార సూర్యనారాయణ, నాట్యాచార్యులు పసుమర్తి శ్రీనివాస్, సీహెచ్ అజయ్‌కుమార్, నాట్యాచారిణి యల్లాజోస్యుల అనురాధ, పద్మశ్రీ హేమంత్, ఉషామాధవిని నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.



గురు సత్కారం చేస్తున్న నిర్వాహకులు